క్లుప్తంగా

నేడు ఆర్‌ఎస్‌ఎస్ రూట్ మార్చ్

విద్యారణ్యపురి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) శతజయంతి ఉత్సవాల సందర్భంగా వరంగల్ మహానగరంలోని కాజీపేట, భవానీ నగర్, విశ్వవిద్యాలయ నగర్, హసన్‌పర్తి నగర్, హనుమకొండ నగర్ కాశిబుగ్గ, ఖిలా వరంగల్‌లో ఆదివారం ఉదయం రూట్ మార్చ్ (పథ సంచలన్) నిర్వహించనున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ మహానగర సంఘ్ సంచాలకుడు డాక్టర్ బందెల మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది స్వయం సేవకులు పూర్తి గణవేశ (యూనిఫామ్)లో పాల్గొంటారని పేర్కొన్నారు. హిందూ సమాజంలో జాగృతిని కలిగిస్తూ స్ఫూర్తి నింపేందుకు దేశ వ్యాప్తంగా ఆర్‌ఎస్‌ఎస్ రూట్‌మార్చ్‌ను నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

8న కేయూలో బాలగోపాల్ స్మారకోపన్యాసం

కేయూ క్యాంపస్: మానవ హక్కుల నేత దివంగత డాక్టర్ బాలగోపాల్ 15వ ఎండోమెంట్ లెక్చర్‌ను కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం సెనెట్ హాల్‌లో ఈనెల 8న ఉదయం నిర్వహించనున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం తెలిపారు. కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ క్రిమినల్ జస్టిస్ అనే అంశంపై హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు పాల్గొని స్మారకోపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనాలని రిజిస్ట్రార్ కోరారు.

గ్రూప్ -1 ర్యాంకర్‌కు సన్మానం



మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరుకు చెందిన గాలి విజయలక్ష్మి, రవికుమార్ దంపతుల కుమారుడు రాహుల్.. గ్రూప్ -1లో ప్రతిభ కనబరిచి అసిస్టెంట్ ట్రెజరర్‌గా ఉద్యోగం సాధించారు. ఈ మేరకు రాహుల్‌ను 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణవిక్టర్, తదితరులు సన్మానించారు.

మంత్రి చొరవతో భూ నిర్వాసితులకు న్యాయం

కాజీపేట రూరల్: అయోధ్యపురం శివారులో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ భూ నిర్వాసితులకు న్యాయం జరగనుందని రైల్వే జేఏసీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాయడంపై అయోధ్యపురం భూ నిర్వాసితులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల బీజేపీ హనుమకొండ మాజీ అధ్యక్షురాలు రావు పద్మతో కలిసి కాజీపేట రైల్వే జేఏసీ నాయకులు, అయోధ్యపురం భూ నిర్వాసితులు హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డిని కలిసి న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు రైల్వే జీఎంకు కేంద్ర మంత్రి లేఖ రాయడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

గౌడ సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్



ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా గౌడ సంఘం సహాయ కార్యదర్శిగా శాంతినగర్‌కు చెందిన కొయ్యడ ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రవీణ్‌కుమార్‌కు తెలంగాణ గౌడ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కక్కర్ల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు గండి లక్ష్మయ్య గౌడ్ శనివారం నియామక పత్రం అందజేసి అభినందించారు.

హిందూ ధార్మిక పరిషత్ ప్రారంభం



ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో హిందూ ధార్మిక పరిషత్ పరిషత్ సంస్థను ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య పున్నమాచార్యులు శనివారం ప్రారంభించారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొండోజు వీరాచార్యులు, మరుపోజు జగదీశ్వర్, మదుపోజు గురుమూర్తి, నరేందర్, జక్కన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు బిల్డింగ్ కార్మికుల మహాసభ

ఐనవోలు : యూనైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా నాలుగో మహాసభను హనుమకొండలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బోళ్ల వెంకటస్వామి, ఇస్రం సుదర్శన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

దసరాకు ఫుల్ కిక్కు!

- రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు
- గతేడాదితో పోల్చుకుంటే బీర్ల విక్రయాలు 23.8శాతం, లిక్కర్ అమ్మకాలు 10.9 శాతం వృద్ధి
- ఈనెల 1, 3వ తేదీల్లోనే రూ.కోట్ల వ్యాపారం



సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లాలో దసరా పండుగ మద్యం వ్యాపారులకు ఫుల్ కిక్కు ఇచ్చింది. గతేడాది కంటే ఈ ఏడాది మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో పెరిగాయి. గతేడాది సెప్టెంబర్ నెలలో 7,22,294 బీర్లు తాగితే ఈసారి ఏకంగా 8,95,200 బీర్లు మందుబాబులు తాగారు. దసరా పండుగ నేపథ్యంలో ఈనెల 2న వైన్స్ బంద్ ఉంటాయన్న ప్రకటనతో మందుప్రియులు ముందుగానే బీర్లను కొనుగోలు చేశారు. వీరితో పాటు బెల్ట్ షాప్ నిర్వాహకులు కూడా ఎక్కువ మొత్తంలో బీర్లను వైన్ షాపుల నుంచి కొని డంప్ చేసుకున్నారు. లిక్కర్ ప్రియులు కూడా గతేడాది 41,283 కాటన్లు తాగితే ఈసారి 45,783 కాటన్లు లాగించేశారు. గతేడాది సెప్టెంబర్ నెలతో పోల్చుకుంటే బీర్ల విక్రయాలు 23.8 శాతం పెరిగితే, లిక్కర్ విక్రయాలు 10.9 శాతం అదనంగా అమ్ముడయ్యాయని ఎక్సైజ్ గణాంకాలు చెబుతున్నాయి. 2024 సెప్టెంబర్‌లో రూ.42.40 కోట్ల వ్యాపారం జరిగితే, ఈసారి రూ.51.868 కోట్ల వ్యాపారం జరిగింది. సుమారు రూ.9కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. దసరా పండుగ వేళ సెప్టెంబర్ నెలాఖరుతో పాటు అక్టోబర్ ఒకటి, మూడు తేదీల్లో రూ.9 కోట్లకు పైగానే మద్యం విక్రయాలు జరిగాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

బీర్ల విక్రయాలిలా..

ఎక్సైజ్ స్టేషన్	2024 సెప్టెంబర్	2025 సెప్టెంబర్
నర్సంపేట	22,654 కాటన్లు	26,335 కాటన్లు
పరకాల	22798 కాటన్లు	26,891 కాటన్లు
వర్ధన్నపేట	14,795 కాటన్లు	21,374 కాటన్లు

ఎక్కడెక్కడ ఎంత వ్యాపారమంటే..

జిల్లాలో 63 మద్యం దుకాణాలున్నాయి. నర్సంపేటలో 25, పరకాలలో 22, వర్ధన్నపేటలో 16 వైన్ షాప్‌లు ఉండగా ఆరు బార్లు ఉన్నాయి. అయితే 2024లో నర్సంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రూ.15.72 కోట్ల మద్యం వ్యాపారం జరిగితే ఈసారి రూ.19.763 కోట్ల మద్యం వ్యాపారం జరిగింది. పరకాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రూ.16.43 కోట్ల బిజినెస్ జరిగితే ఈసారి రూ.19.082 కోట్ల మద్యం వ్యాపారం జరిగింది. వర్ధన్నపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రూ.10.25 కోట్ల బిజినెస్ జరిగితే ఈసారి రూ.13.023 కోట్ల మద్యం వ్యాపారం జరిగింది. మొత్తంగా అన్ని ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో మద్యం విక్రయాలు పెరిగాయి. ఈ నెల 2న దసరా పండుగ, అదే రోజు గాంధీ జయంతి రావడంతో ముందస్తుగా ఒకటి, తర్వాత మూడో తేదీన రూ.9 కోట్లకు పైగానే ఆదాయం వచ్చిందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నరకాసుర వధకు ఏర్పాట్లు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

వరంగల్ అర్బన్: దీపావళి పండుగను పురస్కరించుకొని ఈనెల 19న జరగనున్న నరకాసుర వధ ఉత్సవాలకు బల్దియా తరఫున విస్తృత ఏర్పాట్లు చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈమేరకు నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌లను శనివారం వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. 23 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ 'కుడా' ప్రాంగణంలో 58 అడుగుల భారీ నరకాసుర విగ్రహాన్ని దహనం చేసే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షమీమ్ రిజ్వానా, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ మరుపల్లి రవి, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవి, కోశాధికారి మరుపల్ల గౌతమ్, ఉపాధ్యక్షులు ఆవునూరి రామ్మూర్తి, దూడే బాలకొమురెల్లి, ప్రతినిధులు వనం కుమార్, ఆవునూరి రామన్న శెట్టి మోహన్, కోరె సాంబమూర్తి, నరసింహ, మాటేటి శ్యామ్, కుండె రాజు, ఆవునూరి ఐలేశం, కొమ్ము రాజు, కాటం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపులో భక్తులు

కాజీపేట: శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా కాజీపేట పట్టణంలో దుర్గామాత అమ్మవారి విగ్రహాన్ని పురవీధుల్లో భక్తులు శనివారం రాత్రి ఊరేగించారు. భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయ ఆవరణలో శివ – శక్తి యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు ఆలయ ప్రధాన అర్చకుడు అయినవోలు ప్రవీణ్ కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అలంకరణ, నైవేద్యం సమర్పించి పీఠాన్ని కదిలించారు. అనంతరం అమ్మవారి ప్రతిమలను ఊరేగించి బంధం చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యూత్ అసోసియేషన్ సభ్యులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు మిట్టపల్లి రవీందర్, బి.రంజిత్‌కుమార్, లక్ష్మణ్ కొల్హారియా, దీపక్ కొల్హారియా, బిల్ల సతీష్, గణేష్‌సింగ్, విజయ్, రౌతు కమల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ గలవారినే గెలిపించండి

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

హసన్‌పర్తి: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నీతి, నిజాయితీ గల అభ్యర్థులనే గెలిపించాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. పార్టీ హసన్‌పర్తి మండల ముఖ్యకార్యకర్తల సమావేశం ఎల్లాపురంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో నోట్లతో ఓట్లు కొనే అభ్యర్థులను తిరస్కరించాలని సూచించారు. ఓట్ల చోరీతోనే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన జ్యుడీషియల్, సీబీఐ, గవర్నర్, రాష్ట్రపతి పదవులను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26న శత వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఖమ్మంలో నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, బీసీ హక్కుల రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, నాయకులు మోతె లింగారెడ్డి, శ్యాంసుందర్, సాంబయ్య, జక్కుల సాంబరాజు, గిన్నారపు రాజు, దాసు, నాంపెల్లి లక్ష్మయ్య, రామచందర్, చేరాలు, రాజమౌళి, వెంకటేష్, మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రేటర్ వరంగల్ ఎస్ఈగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఈ

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఎస్ఈ)గా హెచ్.సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

కేఎంసీకి పార్థివ దేహం అప్పగింత



ఎల్లమ్మ (ఫైల్)

ఎంజీఎం: జయశంకర్ జిల్లా చెల్పూరు నివాసి దేవునూరి ఎల్లమ్మ (80) అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని కుటుంబ సభ్యుల సహకారంతో కేఎంసీకి అవయవ దాతల అసోసియేషన్ సభ్యులు శనివారం అప్పగించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి మల్లారెడ్డి మాట్లాడుతూ ఎల్లమ్మ మరణిస్తూ వంద మంది వైద్య విద్యార్థుల పరిశోధనకు ఉపయోగపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో మృతురాలి కుమారుడు దేవునూరి చంద్రమౌళి, ముగ్గురు కుమార్తెలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వేడుకగా పద్మాక్షిదేవి శాంతి కల్యాణం



పద్మాక్షిదేవి శాంతి కల్యాణం జరిపిస్తున్న పండితులు

కాజీపేట: హనుమకొండ జిల్లా కేంద్రంలోని హనుమద్గిరి పద్మాక్షిదేవి ఆలయ ఆవరణలో పద్మాక్షిదేవి శాంతి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు శనివారం నిర్వహించారు. వేద పండితుడు నాగిళ్ల షణ్ముక పద్మనాభ అవధాని బృందం వేడుకలను కనులపండువగా జరిపించింది. భక్తులకు ఆలయంలో అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం దేవతామూర్తులతో తెప్పోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు నాగిళ్ల శంకర్‌శర్మ పాల్గొన్నారు.

ఆగిన ఆర్టీసీ బస్సు.. స్తంభించిన ట్రాఫిక్



కాజీపేట వంతెనపై ఇరువైపులా నిలిచిన వాహనాలు

కాజీపేట: కాజీపేట రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై శనివారం కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. వంతెన పైనుంచి కాజీపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు టైర్ పంక్చర్ కావడంతో మధ్యలోనే ఆగిపోయింది. దాంతో బ్రిడ్జికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వన్ వే పద్ధతిలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బస్సును కిందికి తీసుకొచ్చారు.

వడ్డెర కులస్తులకు అవకాశం ఇవ్వాలి



తీర్మాన పత్రాన్ని చూపుతున్న నాయకులు

కాజీపేట: రాష్ట్ర వ్యాప్తంగా మైనింగ్ శాఖ ద్వారా వచ్చే ఆదాయంలో 30 శాతం వడ్డెర కుల సంఘాలకు ఇచ్చి ఆదుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గండికోట సంపత్ డిమాండ్ చేశారు. కాజీపేట పట్టణంలోని సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వడ్డెర కులస్తులను ఆదుకున్నట్లుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేయూతనందించాలని కోరుతూ సభ్యులు ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ వడ్డెర కులస్తులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఉన్నతికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. సమావేశంలో స్థానిక సంఘం అధ్యక్షుడు సమ్మయ్య, పల్లపు నవీన్, గండికోట సాంబరాజు, కంది రాజు, కంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ ఆశయాలు కొనసాగించాలి



మాట్లాడుతున్న శివకుమార్

హసన్‌పర్తి: బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గుండమీది శ్రీనివాస్ ఆశయాలు కొనసాగించాలని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ పిలుపునిచ్చారు. శనివారం నిర్వహించిన శ్రీనివాస్ వర్ధంతి కార్యక్రమంలో శివకుమార్ మాట్లాడుతూ శ్రీనివాస్ మరణం బీజేపీకి తీరని లోటని అన్నారు. అనంతరం, గుండమీది శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, తాళ్లపల్లి కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి, బీజేపీ నాయకులు తాళ్ల రమేష్, హరిశంకర్, దాసరి రాజు, ఆత్మ మాజీ చైర్మన్ చంద్రమోహన్, దేవస్థాన మాజీ చైర్మన్ శ్రీనివాస్, శ్రీనివాస్, డింపు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి 'ఉషూ'కు వరుణ్



వరుణ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం

హసన్‌పర్తి: జాతీయ స్థాయి ఉషూ పోటీలకు హసన్‌పర్తి ఉన్నత పాఠశాల విద్యార్థి పి.వరుణ్ ఎంపికయ్యాడు. గత నెల మహబూబాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో వరుణ్ పాల్గొని ప్రతిభ కనబరిచిన జాతీయ స్థాయికి అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి, పీఈటీ పార్థసారథి తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి శ్రీనగర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వరుణ్ పాల్గొంటారని వారు చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలచాకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో వరుణ్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

'వెల్‌నెస్'కు కాజీపేట అనుకూలం

- అందుబాటులో భవనాలు
- సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్న పింఛన్‌దారులు



కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న భవనాలు

కాజీపేట: ఇటీవల కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వెల్‌నెస్ సెంటర్‌ను కాజీపేట పట్టణంలోని మున్సిపల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఖాళీగా ఉన్న భవనంలో ఏర్పాటు చేయడం సముచితంగా ఉంటుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ట్రైసిటీలో ఉన్న పింఛన్‌దారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఎంపీ డాక్టర్ కడియం కావ్య చేసిన కృషి ఫలించి వెల్‌నెస్ సెంటర్ మంజూరైంది. ఈ సెంటర్ ఏర్పాటు అంశం కొలిక్కి రాకపోవడంతో ట్రినగరిలో ఎక్కడపెడితే బాగుంటుందనే చర్చలో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. వరంగల్ పోస్టల్ భవనం ఇవ్వడానికి అధికారులు నిరాకరించినట్లుగా తెలుస్తోంది. హనుమకొండలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సరైన భవనాలు లభించడం లేదు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అనుమతితో రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టుల కోసం వెల్‌నెస్ సెంటర్‌ను మెటర్నిటీ ఆస్పత్రి ఆవరణలో నిర్వహిస్తున్నారు.

ఖాళీగా ఉన్న భవనాలు

కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో సరిపడా భవనాలు ఖాళీగా ఉన్నాయి. గతంలో ఈ భవనాల్లో హనుమకొండ, వరంగల్ జిల్లాల భూ కొలతలు, ల్యాండ్ సర్వే కార్యాలయాలు ఉండేవి. సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నిర్మాణంతో ఈ కార్యాలయాలను సుబేదారికి తరలించారు. దాదాపు మూడున్నర సంవత్సరాలుగా రెండు అంతస్తుల్లోని గదులు ఖాళీగా ఉంటున్నాయి. వాటిలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తే అద్దె భారం లేకపోవడమే గాక రిటైర్డ్ ఉద్యోగులకు సౌకర్యవంతంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

10వేలకు పైగా పింఛన్‌దారులు

వరంగల్ మహానగరంలో రైల్వే, ఎఫ్‌సీఐ, పోస్టల్, టెలికాం తదితర సంస్థలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు సుమారు 10వేల మందికి పైగానే ఉంటారని అంచనా. వారిలో సగానికి పైగా కాజీపేట పట్టణంలోనే ఉంటారు. పట్టణంలో ఉన్న రెండు రైల్వే రిటైర్డ్ కార్మిక సంఘాల్లో 4,500 మంది వరకు సభ్యులు ఉన్నారు. కాజీపేట సర్కిల్ కార్యాలయంలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల వృద్ధాప్యంలో ఉన్న పింఛన్‌దారులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. వరంగల్ ఎంపీ కడియం కావ్య మరోమారు జిల్లా అధికారులతో కలిసి వచ్చి వృథాగా ఉంటున్న భవనాలను పరిశీలించి అనుమతులు సాధించాలని పలువురు పెన్షన్‌దారులు కోరుతున్నారు.

కాజీపేట అనువుగా ఉంటుంది



కాజీపేటలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తే పెన్షనర్లకు ఉపయుక్తంగా ఉంటుంది. నగరంలో ఉన్న పింఛన్‌దారులలో సగానికి కంటే ఎక్కువగా కాజీపేట పరిసర ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. వారిలో 70ఏళ్లు దాటిన వారు సగం మంది ఉంటారు. వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే బాధలు తప్పుతాయి.

– గుర్రపు సుధాకర్ రావు, రిటైర్డ్ పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి